
• సుద్దులంలో తడిసిన జొన్న కంకులను సేకరిస్తున్న రైతులు


• ఎడపల్లిలో నేలకొరిగిన వరి


కోటగిరిలో నేలకొరిగిన వరిని పరిశీలిస్తున్న రైతులు


కొప్పర్తిలో నేలకొరిగిన మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న జేడీఏ

అకాల నష్టం

జిల్లా వ్యాప్తంగా 6058 ఎకరాల్లో పంటలకు నష్టం

వడగండ్ల వానతో దెబ్బతిన్న వరి, మక్కజొన్న, సజ్జ

నేలరాలిన మామిడి, దెబ్బతిన్న కూరగాయలు

సాలూరాలో పంటలను పరిశీలించిన బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

పది మండలాల పరిధిలో వ్యవసాయ అధికారుల సర్వే

నిజామాబాద్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో కురిసిన అకాల వర్షం, ఈదురుగాలులతో రైతులకు భారీ నష్టం సంభవించింది. ఒకేసారి ఉరుములు, మెరుపులతో శనివారం రాత్రి వర్షం పడడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. పొలాలతో పాటు రోడ్లవెంట ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయింది. తడిసిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు తీవ్రంగా ప్రయత్నించారు. పలు గ్రామాల పరిధిలో అకాల వర్షంతో మామిడి రైతుకు తీవ్ర నష్టం వాటిల్లింది. వర్షంతో పాటు గాలి బాగా వీచడంతో మామిడి నేలరాలింది. కొన్నిచోట్ల సజ్జ, మక్కజొన్న, కూరగాయాల పంటలు దెబ్బతిన్నాయి.

అతలా కుతలం

వడగండ్ల వర్షం జిల్లాను అతలా కుతలం చేసింది. చేతికందిన వరి, మొక్కజొన్న, నువ్వులు, జవార్ పంటలు భారీగా దెబ్బతిన్నాయి. పంట పూర్తికావడంతో పాటు కోతకు వచ్చిన దశలో ఒకేసారి వడగండ్ల వర్షం పడటంతో రైతులు భారీగా నష్టపోయారు. జిల్లాలోని పది మండలాల పరిధిలో పంటలు దెబ్బతినగా అధికారులు అంచనా వేస్తున్నారు. సర్వే నెంబర్ల ఆధా రంగా పరిశీలిస్తూ పంటల వివరాలను సేకరిస్తున్నారు. ప్రాథమిక నివేదికను కలెక్టర్‌తో పాటు ప్రభుత్వానికి పంపించారు. దెబ్బతిన్న పంటలను బోధన్ నియోజకవర్గం పరిధిలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పరిశీలించారు. రైతులను ఆదుకుంటామని ప్రకటించారు.


• సాలూరాలో..


పంటలకు భారీ నష్టం

జిల్లాలో ఒక్కసారిగి వర్షం, గాలి దుమారంతో పాటు వడగండ్లు పడటంతో పెద్ద ఎత్తున పంట దెబ్బతింది. జిల్లాలోని ధర్పల్లి, డిచ్‌పల్లి, ఇందల్వాయి, నిజామాబాద్ రూరల్, సిరికొండ, బోధన్, మెండోరా, వర్ని, ఎడపల్లి మండలాల పరిధిలో ఈ వర్షం భారీగా పడింది. మొత్తం 10 మండలాల పరిధిలో ఈ వర్షం పడగా 44 గ్రామాల పరిధిలో పంట ఎక్కువగా దెబ్బతింది. జిల్లాలో అత్యధికంగా ఇందల్వాయి మండలంలో వరిపంటకు ఎక్కువగా నష్టం జరిగింది. జిల్లాలో మొత్తం 6058 ఎకరాల్లో పంటలు దిబ్బతిన్నట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. మొత్తం 3076 మంది రైతులకు చెందిన పంటలు ఈ వడగండ్ల వల్ల నష్టం జరిగినట్లు అంచనా వేశారు. జిల్లాలో శనివారం సాయంత్రం నుంచి రాత్రి కురిసిన వడగండ్ల వర్షం వల్ల వరి 5661 ఎకరాల్లో దెబ్బతిన్నట్లు అంచనా వేశారు. ఒక ఇందల్వాయి మండలంలోనే 2360 ఎకరాల్లో, సిరికొండలో 1552 ఎకరాలు, ఎడపల్లిలో 930 ఎకరాల్లో వరి ఎక్కువ మొత్తంలో దెబ్బతినగా మిగతా మండలాల్లో ఓ మోస్తారుగా నష్టం జరిగింది. డిచ్‌పల్లి మండలంలో 557 ఎకరాల్లో దెబ్బతినగా, ధర్పల్లిలో 202 ఎకరాల్లో పంటకు నష్టం జరిగింది. నిజామాబాద్ రూరల్‌లో 54 ఎకరాల్లో పంట దెబ్బతింది. జిల్లాలో మొక్కజొన్న పంట కూడా 292 ఎకరాల్లో దెబ్బతింది. బోధన్ మండలం పరిధిలో 217 ఎకరాల్లో ఎక్కువగా నష్టం జరిగింది. జిల్లాలో జవార్ 93 ఎకరాల్లో, నువ్వులు 12 ఎకరాల్లో దెబ్బతింది. ఒకేసారి వడగండ్ల వర్షం రావడం వల్ల పంటకు భారీ నష్టం జరిగింది. పంటలు మరికొన్ని రోజులైతే కోసే దశలో ఉండగా ఒకేసారి వడగండ్లు పడటంతో పెద్దఎత్తున నష్టం జరిగింది. వడగండ్ల వల్ల గొలుసు రాలడంతో ఎక్కువ మొత్తంలో దెబ్బతిన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. కొన్నిచోట్ల వర్షానికి పంట నేలకొరిగింది. దీంతో రైతులకు కోలుకోని దెబ్బతగిలినట్లు వారు వాపోతున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు. పంటలు దెబ్బతిన్న ప్రాంతాల్లో వ్యవసాయ అధికారులు సర్వే చేపట్టారు. జిల్లా వ్యవసాయ అధికారి వాజీద్ హుస్సేన్ బోధన్, డిచ్‌పల్లి మండలాల పరిధిలో పర్యటించి పంటల వివరాలను సేకరించారు.

పంటలను పరిశీలించిన ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

బోధన్ నియోజకవర్గంలో పంటలు దెబ్బతిన్న ప్రాంతాల్లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పరిశీలించారు. దెబ్బతిన్న వరి, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. సాలూరా మండలం కొప్పర్తి క్యాంప్‌లో మొక్కజొన్న పంటను పరిశీలించారు. ఎడపల్లి మండలంలో దెబ్బతిన్న వరిపంటను పరిశీలించారు. రైతులను ఆదుకుంటామని ఆయన తెలిపారు. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిహారం అందే విధంగా చూస్తామని ఆయన తెలిపారు. రైతులు మాత్రం పంట దెబ్బతినడంతో ప్రభుత్వమే ఆదుకోవాలని కోరుతున్నారు.



• బాపూనగర్‌లో వరి పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి


వర్ని మండలం సిద్దాపూర్ శివారులో నేలకొరిగిన సజ్జపంట

కోడ్ కూసింది!

జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రముఖుల విగ్రహాలకు ముసుగులు వేశారు. పలు ప్రాంతాల్లో గోడలపై ఉన్న వివిధ పార్టీలకు సంబంధించిన రాతలను, రోడ్ల వెంట ఏర్పాటు చేసిన ఫ్లెక్సీను తొలగిస్తున్నారు. సభలు, సమావేశాలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు తెలిపారు. జూన్ 6 వరకు ఎన్నికలకు కోడ్ అమలులో ఉంటుందని, కోడ్ ఉల్లంఘనకు సంబంధించి ఎవరైనా టోల్‌ఫ్రీ నెంబర్ 1950కి కానీ సీవిజిల్ యాప్‌లో కానీ ఫిర్యాదు చేయవచ్చని కలెక్టర్ సూచించారు.


నగరంలో ఎన్టీఆర్ విగ్రహానికి ముసుగు


నగరంలోని పులాంగ్ వద్ద ఇందిరాగాంధీ విగ్రహానికి ముసుగు


నగరంలోని వినాయక్‌నగర్‌లో రాజీవ్ గాంధీ విగ్రహానికి ముసుగు


విలేకరుల సమావేశంలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు, సీపీ కల్మేశ్వర్

పార్లమెంట్ పరిధిలో 1807 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

జిల్లా వ్యాప్తంగా 18 చోట్ల చెక్‌పోస్టుల ఏర్పాట్లు

విలేకరుల సమావేశంలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

ఎన్నికల నిబంధనలు పాటించాలి : సీపీ

ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు

నిజామాబాద్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని రకాల చర్యలను చేపట్టామని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అన్నారు. కలెక్టరేట్‌లో సీపీ కల్మేశ్వర్‌తో కలిసి ఆదివారం విలేకరులతో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్‌కు అనుగుణంగా నియమనిబంధనలు పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఈ ఏర్పాట్లను చేస్తున్నామని తెలిపారు. ఈ పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ ఏప్రిల్ 18న ఇస్తామన్నారు. నామినేషన్ల స్వీకరణ ఏప్రిల్ 25 వరకు, పరిశీలన 26న చేపట్టనున్నామన్నారు. నామినేషన్ల విత్‌డ్రాకు ఏప్రిల్ 29 వరకు అవ కాశం ఎన్నికల కమిషన్ ఇచ్చిందన్నారు. నిజామాబాద్ పార్లమెంట్‌కు మే 13న ఎన్నికలు జరుగుతాయని కలెక్టర్ అన్నారు. జూన్ 4న ఎన్నికల ఫలితాలు ఉంటాయని ఆయన తెలిపారు. జూన్ 6 వరకు ఎన్నికల కోడ్ కొనసాగించనున్నారు. ఈ ఎన్నికల కోసం పూర్తిస్థాయిలో ఏర్పాట్లను చేశామని జిల్లా కలెక్టర్ అన్నారు.

16, 72,118 మంది ఓటర్లు

పార్లమెంట్ పరిధిలో మొత్తం 16లక్షల 72వేల 118 ఓటర్లు ఉన్నారని కలెక్టర్ తెలిపారు. వీరిలో పురుషులు 7లక్షల 94వేల 819 మంది ఉండగా, మహిళా ఓటర్లు 8లక్షల 77వేల 225 మంది ఉన్నారన్నారు. శాసనసభ ఎన్నికల తర్వాత నమోదైన ఓటర్లు ఉన్నారన్నారు. వీరు 22వేల 498 మంది పెరిగారన్నారు. ఇతర ఓటర్లు 74 మంది ఉన్నారన్నారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల పరిధిలో మొత్తం 1807 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ పోలింగ్ కేంద్రాల పరిధిలో 190 సెక్టర్లుగా విభజించామన్నారు. ఈ పోలింగ్ కోసం అవసరమైన సిబ్బంది డాటాను 8వేల వరకు సిద్ధం చేశామన్నారు. మొత్తం 1807 పోలింగ్ కేంద్రాలకు ప్రిసైడింగ్ అధికారులుగా 2349 మంది, ఏపీవోలుగా 2349 మంది, ఇతర ఉద్యోగులు 4698 మందిని నియమిస్తున్నామని ఆయన తెలిపారు. పీడబ్ల్యూడీ ఓటర్లతో పాటు 85ఏళ్లు నిండిన వారు ఇంటి వద్ద నుంచి ఓటు వేసేందుకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. వారు నోటిఫికేషన్ వచ్చిన రోజు నుంచి ఏప్రిల్ 22 వరకు దరఖాస్తు చేసుకుంటే అవకాశం కల్పిస్తామని ఆయన తెలిపారు. అలాగే నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో మొత్తం 512 క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు.

27 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు

ఈ ఎన్నికలను మానిటరింగ్ చేసేందుకు ఎంసీసీ టీమ్‌లను నియమించామన్నారు. పార్లమెంట్ పరిధిలో మొత్తం 27 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఒక్కొక్క స్క్వాడ్‌లో వివిధ శాఖల అధికారులు ఉంటారన్నారు. వీరితో పాటు 28 స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఇవేకాకుండా 22 వీడియో సర్వైలెన్స్ టీమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. తప్పనిసరిగా ప్రచారాలకు, ర్యాలీలకు అనుమతులు తీసుకోవాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. రాజకీయ పార్టీలకు సంబంధించిన హోర్డింగ్‌లు, ప్రభుత్వానికి సంబంధించిన ప్రచారాలకు సంబంధించిన వన్నీ తొలగిస్తున్నామని ఆయన తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా సభలు, సమావేశాలకు, ర్యాలీలకు 48 గంటల ముందు అనుమతులు తీసుకోవాలని కోరారు.

ఎన్నికల నిబంధనలను పాటించాలి : సీపీ

పార్లమెంట్ ఎన్నికల నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగెనెవార్ అన్నారు. జిల్లా పరిధిలో 18 చెక్‌పోస్టులను ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలిపారు. వీటిలో 4 అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు ఉన్నాయన్నారు. మహారాష్ట్ర సరిహద్దుల వెంట వీటిని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సాలూరా, కద్లాం, కందకుర్తి, పోతంగల్‌లో ఈ అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లాలో దూద్‌గాం, బ్రహ్మంగారి గుట్ట, సిరికొండ, ఇందల్వాయి టోల్‌గేట్, మల్లారం గండి, యంచ వద్ద ఈ చెక్‌పోస్టులను ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ ఎన్నికల కోసం మొత్తం 2353 మంది జిల్లాకు చెందిన పోలీసులను వినియోగిస్తున్నామని ఆయన తెలిపారు. వీరితో పాటు 84 సెక్షన్ల సీఆర్‌పీఎఫ్, 32 సెక్షన్ల టీఎస్ఎస్‌పీ ఉపయోగిస్తున్నామని ఆయన తెలిపారు. మొత్తం ఎన్నికల కోసం 6 ఏసీపీలు, 32 మంది సీఐలు, 44 మంది ఎస్సైలు, 258 మంది ఏఎస్సై, హెడ్‌కానిస్టేబుళ్లు, 1254 మంది పీసీలు, 759 మంది హోంగార్డులను ఎన్నికల విధులకు వినియోగిస్తున్నట్లు తెలిపారు.

ఆయుధాలు సరెండర్ చేయాలి

పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని జిల్లాలో ఆయుధాలు కలిగి ఉన్న వారందరిని సరెండర్ చేయాలని కోరామని సీపీ తెలిపారు. బ్యాంకుల బందోబస్తు మినహాయించి మిగతా వారందరూ సమీప పోలీస్ స్టేషన్‌లో డిపాజిట్ చేయాలని ఆయన కోరారు. జిల్లాలో 64 మంది వద్ద ఈ వెపన్స్ ఉన్నాయన్నారు. వీటిలో 45 ఇప్పటికే డిపాజిట్ చేశారని ఆయన తెలిపారు.

24 గంటల తనిఖీలు

ఈ ఎన్నికల సందర్భంగా చెక్‌పోస్టులు 24 గంటల తనిఖీలు ఉంటాయన్నారు. ఎవరైనా అవసరాల నిమిత్తం డబ్బులు తీసుకువెళ్తే తప్పనిసరిగా రసీదులు దగ్గర ఉంచుకోవాలని సీపీ కల్మేశ్వర్ తెలిపారు. ప్రతి ఒక్కరూ 50వేలలోపు తీసుకువెళ్లేందుకు అవకాశం ఉందన్నారు. అంతకుమించి తీసుకెళ్లేవారు తప్పనిసరిగా వివరాలను ఉంచుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, అదనపు డీసీపీ కోటేశ్వర్‌రావు, ట్రైనీ ఐఏఎస్ కిరణ్మయి, ట్రైనీ ఐపీఎస్ చైతన్యరెడ్డిలు పాల్గొన్నారు.

నేటి నుంచి పదో తరగతి పరీక్షలు

• హాజరుకానున్న 22,281 మంది విద్యార్థులు


కమ్మర్‌పల్లిలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నిజామాబాద్ అర్బన్, మార్చి 17: పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభం కానున్నాయి. జిల్లా వ్యాప్తంగా 141 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పరీక్షలు జరగనున్నాయి. సోమవారం తెలుగు పరీక్ష, మంగళవారం హిందీ, గురువారం ఇంగ్లిష్ పరీక్ష, శనివారం గణితం పరీక్షలు ఉదయం 9.30 నుంచి 12.30 వరకు జరగనున్నాయి. ఈనెల 26వ తేదీ మంగళవారం ఫిజికల్ సైన్స్, 28న గురువారం బయోలాజికల్ సైన్స్ పరీక్షలు మాత్రం ఉదయం 9.30 నుంచి 11గంటల వరకు జరగనున్నాయి. ఈనెల 30 శనివారం నిర్వహించే సోషల్ పరీక్ష ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు నిర్వహించనున్నారు. మాస్‌కాపీయింగ్‌ను నిరోధించేందుకు ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు. 141 సిట్టింగ్ స్క్వాడ్, 7 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు. పరీక్ష ప్రారంభమైన ఐదు నిమిషాల వరకు పరీక్ష కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతించనున్నట్లు డీఈవో ఎన్‌వీ దుర్గాప్రసాద్ తెలిపారు.

మీడియా సెంటర్ ప్రారంభం

• ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

నిజామాబాద్ అర్బన్, మార్చి 17: పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ (ఎంసీ ఎంసీ)ను ఆదివారం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, సీపీ కల్మేశ్వర్‌తో కలిసి ప్రారంభించారు. అందుబాటులో ఉన్న సదుపాయాలను, ఎంసీఎంసీ పనితీరుకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియా సెంటర్ ద్వారా ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా ప్రతినిధులకు అందించాలని సూచించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేయడం జరిగిందని దీని ద్వారా చెల్లింపు వార్తలను గుర్తించడం, ప్రచురణ, ముందస్తు అనుమతి లేకుండా ప్రకటనలు ప్రసారం చేయడం, సంబంధిత అభ్యర్థి ప్రచార వ్యయంలో వాటిని లెక్కించడం, సోషల్ మీడియాలో అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రకటనల వంటి వాటిని సకాలంలో ఆమోదిస్తూ మంజూరు చేయాలని సూచించారు. సాటిలైట్ ఛానల్లో వచ్చే వార్తలను పూర్తిస్థాయిలో రికార్డు చేయాలని, వార్తాపత్రికలు, ఈపేపర్, టెలివిజన్ ఛానల్లో, స్థానిక కేబుల్ నెట్‌వర్క్, సోషల్ మీడియా, మూవీహౌజ్‌లు, సంక్షిప్త సందేశాలు, ఇతర ఆడియో, వీడియోలు విజువల్ మీడియాతో సహా ప్రకటనలను ముందస్తుగా అనుమతి పొందిన తర్వాతనే విడుదల చేయాలన్నారు. సోషల్ మీడియాలో వచ్చే పోస్టులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎన్నికల ప్రవర్తనా నియమావళి అతిక్రమించిన పోస్టులపై చట్టప్రకారం చర్యలు ఉంటాయన్నారు. ఎన్నికలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు మీడియా సహకారం అందించాలని కలెక్టర్ కోరారు.

టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

● మండల విద్యాశాఖ అధికారి గణేష్ రావు

నవీపేట, మార్చి 17: సోమవారం నుంచి జరిగే పదవ తరగతి వార్షిక పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని ఇన్‌చార్జీ ఎంఈవో గణేష్ రావు తెలిపారు. మోడల్ పాఠశాల ఏ సెంటర్, మోడల్ పాఠశాల బి సెంటర్‌తో పాటు జడ్పీహెచ్‌ఎస్ బాలుర పాఠశాల, జడ్పీహెచ్‌ఎస్ జన్నేపల్లి, జడ్పీహెచ్‌ఎస్ నాళేశ్వర్ పాఠశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. మాక్లూర్ మండలం చిక్లీలోని బ్రిలియంట్ పాఠశాల, రెంజల్ మండలానికి చెందిన మైనారిటీ బాలికల గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులను కలుపుకుని మండలంలో 620 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలకు హాజరు కానున్నారని ఆయన పేర్కొన్నారు. మాస్ కాపీయింగ్ జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయడం జరిగిందని ఆయన వివరించారు.

రెంజల్ ఎస్సైగా సాయన్న



ఎస్సైగా బాధ్యతలు చేపడుతున్న సాయన్న

రెంజల్, మార్చి 17: రెంజల్ నూతన ఎస్సైగా సాయన్న ఆదివారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఎస్సై ఉదయ్‌కుమార్ బదిలీపై ధర్మపురికి వెళ్లడంతో ఆయన స్థానంలో ఆదిలాబాద్ 1వ టౌన్ ఎస్ఐగా విధులు నిర్వహించిన సాయన్న బదిలీపై రెంజల్ ఎస్సైగా వచ్చినట్లు తెలిపారు. మండలంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని, మండలంలో అసాంఘిక కార్యక్రమాలు జరిగితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉంటానని మండల ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

బైక్ ఢీకొని వృద్ధుడి మృతి

నవీపేట, మార్చి 17: మండల కేంద్రానికి చెందిన కుమ్మరి రాములు(80) అనే వృద్ధుడిని బైక్ ఢీకొనడంతో ఆదివారం మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. స్థానిక కందకుర్తి రోడ్డు సమీపంలో నవీపేట వైపు నడుచుకుంటూ వస్తున్న రాములును వెనుక నుంచి వచ్చిన బైక్ ఢీకొనడంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయని వెంటనే అతనిని జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడని వారు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా మండలంలోని అబ్బాపూర్(ఎం)కు చెందిన పద్మారావు అనే వ్యక్తి బైక్ నడుపగా ప్రమాదం జరిగిందని, ఈ ప్రమాదంలో పద్మారావుకు సైతం తీవ్ర గాయాలయ్యాయని స్థానికులు పేర్కొన్నారు. ఈ విషయంపై ఎస్సై యాదగిరి గౌడ్‌ను వివరణ కోరగా.. ప్రమాదం జరిగిన మాట నిజమేనని ఈ విషయంపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని అన్నారు.

అకాల వర్షంతో అన్నదాతల ఆందోళన

వర్ని, మార్చి 17: ఆరుగాలం శ్రమించి పండించిన వరిపంట చేతికి వచ్చే సరికి అకాల వర్షాలు పడటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వర్ని, చందూర్ మండలాల పరిధిలో రైతులు సాగు చేసిన వరి పైరు ఈదురు గాలులు వర్షంతో నేలకొరిగి నీట మునిగాయి. దీంతో పంట ధాన్యం మక్కిన తరుణంలో మొలకెత్తి నష్టపోయే ప్రమాదం ఏర్పడిందని కర్షకులు వాపోతున్నారు. ఇంతటితో అకాల వర్షాలు తగ్గితే తమకు నష్టం నుంచి బయట పడే ఆస్కారం ఉందని రైతులు పేర్కొంటున్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

నవీపేట, మార్చి 17: మండలంలోని బినోలలో ముత్యాలమ్మ ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకం, యజ్ఞం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం మహిళలు తలపై బోనాలను ఎత్తుకుని ఆలయానికి తరలివెళ్లి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. పాడిపంటలు చల్లగా ఉండాలని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.



బినోలలో బోనాలు తీస్తున్న దృశ్యం

వన్నెల్(బి)లో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు



వన్నెల్(బి) ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ముప్కాల్, మార్చి17: బాల్కొండ మండలం వన్నెల్(బి) గ్రామంలో శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగాప్రారంభమ య్యాయి.ఉదయం ఉత్సవ మూర్తులకు అభిషేకం, మండ పరాధన, సుదర్శన యాగం, పంచామృతలతో అభిషేకం, స్థాపిక దేవత హవనం చేపట్టారు. ఆల యంలో వేదమంత్రోచ్చరణాలతో మొదటి రోజు ఉత్సవాలు నిర్వహించారు. బ్రహ్మోత్స వాలలో భక్తులు, గ్రామసులు పాల్గొని స్వామివారికి పూజలు నిర్వహించారు.

ముందుకు సాగని గిరిజన పాఠశాల నిర్మాణ పనులు



నిర్మాణం ఆగిపోయిన గిరిజన గురుకుల పాఠశాల

సిరికొండ మార్చి 17 : మూడేళ్లుగా గిరిజన గురుకుల పాఠశాల భవన నిర్మాణ పనులు జరుగుతూనే ఉన్నాయి. సిరికొండ మండలం చీమన్‌పల్లి గ్రామంలో గిరిజన గురుకుల పాఠశాల భవన నిర్మాణానికి బీఆర్ఎస్ ప్రభుత్వం మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ కృషి వల్ల రూ.4.20 కోట్ల నిధులు మూడున్నరేళ్ల కిత్రం మంజూరు చేసింది. సంబంధిత కాంట్రాక్టర్ మూడేళ్ల క్రితం పనులు ప్రారంభించిన నేటికి పనులు పూర్తికాకపోవడంతో విద్యార్థులు ఆర్మూర్ పట్టణంలో విద్యాభ్యాసం చేస్తున్నారు. చీమన్‌పల్లి గ్రామం అభివృద్ధి చెందడానికి బాజిరెడ్డి గోవర్ధన్ గిరిజన గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను సుమారు ఆరున్నరేళ్ల క్రితం ప్రభుత్వానికి నచ్చ చెప్పి మంజూరు చేయించారు.అయిన విద్యార్థులకు పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలను అందుబాటులోకి తీసుక రావడంలో అధికారులు విఫలమయ్యారనే విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి.పాఠశాల ప్రారంభమయిన మొదట్లో కొంత కాలం చీమన్‌పల్లి గ్రామంలో అద్దె భవనంలో కొనసాగించినప్పటికీ సరియైన సౌకర్యాలు లేవనే కారణంలో పాఠశాలను ధర్పల్లికి తరలించారు.ఇదే పాఠశాలకు అనుబంధంగా జూనియర్ కళాశాలను కూడ ప్రభుత్వం మంజూరు చేసింది. ధర్పల్లిలో కూడ భవనం సరిపోనందున అధికారులు పాఠశాలను, కళాశాలను ఆర్మూర్‌కు తరలించారు. ప్రస్తుతం విద్యాబోధన ఆర్మూర్‌లో జరుగుతోంది. దీంతో బాజిరెడ్డి గోవర్ధన్ అప్పట్లో చీమన్‌పల్లి గ్రామస్థులతో చర్చించి కావలసిన స్థలాన్ని కొనుగోలు చేయించారు. ప్రభుత్వం భవన నిర్మాణానికి నాలుగు కోట్ల ఇరువై లక్షల నిధులను మంజూరు చేయించింది. బాజిరెడ్డి గోవర్ధన్ శంకుస్థాపన కూడ చేశారు. పనులు ప్రారంభించగానే అటవీ శాఖ అధికారులు వచ్చి నిర్మాణ పనులను నిలిపివేశారు. అటవీ శాఖ అధికారులతో గిరిజన కార్పోరేషన్ అధికారులు,బాజిరెడ్డి గోవర్ధన్ చర్చించి నిర్మాణ పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకున్నారు. సంబంధిత కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారు.మొదట్లో పనులు వేగంగా జరిగినప్పటికి రాను రాను నత్త నడకను మరిపించేలా పనులు జరుగుతున్నాయి.నిధులు విడుదల కాకపోవడమో లేక మరే కారణమో కాని పనులు మందకోడి జరుగుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈమధ్య కాలంలో అయితే పనులు ముందుకు సాగడం లేదని స్థానికులు చెపుతున్నారు.ఆర్మూర్‌లో కూడవిద్యార్థులకు కావాలసిన సౌకర్యాలు కూడ లేవని తెలుస్తోంది. నూతనంగా ఎన్నికైన స్థానిక శాసనసభ్యులు భూపతిరెడ్డి చొరవ చూపించి పనులు సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

త్వరగా పనులు పూర్తి చేయాలి

అధికారులు స్పందించి గిరిజన గురుకుల పాఠశాల భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. నిధులున్న పనులు పూర్తి కాకపోవడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

● భవనాల నిర్మాణం పూర్తయ్యేదెన్నడూ...

విద్యార్థులకు సరియైన సౌకర్యాలు ఇతర మౌలిక సదుపాయలు కల్పించాలనే లక్ష్యంతో భవన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికి పనులు పూర్తి చేయించడంలో అధికారుల నిర్లక్ష్యం కొట్టోచ్చినట్లు కనిపిస్తుంది. పనులు ప్రారంభించి సుమారు మూడున్నరేళ్లు కావస్తున్న ఇంకా పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. పనులను సకాలంలో పూర్తి చేయించడంలో సంబంధిత కాంట్రాక్టర్ నిర్లక్ష్యమో లేక ప్రభుత్వం కాంట్రాక్టర్‌కు చేసిన పనులకు నిధులు విడుదల చేయక పోవడం వల్లనో కాని మూడున్నరేళ్లుగా పనులు కొనసాగుతూనే ఉన్నాయి. పనులు సకాలంలో పూర్తి కాకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గిరిజన గురుకుల పాఠశాల, కళాశాల భవన నిర్మాణ పనులను పూర్తి చేయించడంలో అధికారులు, ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యం కొట్టోచ్చినట్లు కనిపిస్తూనే వుంది

పనుల్లో నాణ్యతను పాటించాలి

పనులు చేయడంలో సంబంధిత కాంట్రాక్టర్ నాణ్యతను పాటించాలని ప్రజలు కోరుతున్నారు. స్లాబ్ పనులతో పాటు గోడల నిర్మాణంలో చేసే పనుల్లో సరియైన నాణ్యతను పాటించడంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అధికారులు పనులను నాణ్యతగా చేయించాలని కోరతున్నారు. వివరణ కోసం సంబంధిత ఏఈ సురేందర్‌రెడ్డికి పోన్ చేయగా చేసిన పనులకు నిధులు విడుదల కాకపోవడం వల్లె కాంట్రాక్టర్ పనులు చేయడం లేదని చెప్పారు. భవన నిర్మాణ పనులు ప్రారంభం అయిన నాటి నుంచి ఇదే పరిస్థితి ఉందన్నారు.

ఎన్నికల ప్రచార సభలకు ముందస్తుగా అనుమతి తీసుకోవాలి

● రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో కలెక్టర్, సీపీ

నిజామాబాద్ అర్బన్, మార్చి 17: ఎన్నికల ప్రచార సభలు, సమావేశాలు, ఇతర కార్యక్రమాల కోసం ముందస్తుగానే దరఖాస్తు చేసుకొని అనుమతి పొందాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, సీపీ కల్మేశ్వర్లు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరిగేలా రాజకీయ పార్టీల తరఫున కృషి చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించిన నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చిందన్నారు. రాజకీయ పార్టీలకు, నాయకులకు, అభ్యర్థులకు ఎన్నికల ప్రచార సభలు, సమావేశాలు నిర్వహించేందుకు సింగిల్ విండో సిస్టమ్ ద్వారా అనుమతులు అందిస్తామని అయితే కనీసం 48 గంటల ముందు సువిద పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ముందు ఎవరు దరఖాస్తు చేసుకుంటే వారికే అనుమతి ఉంటుందని రాత్రి 10గంటల నుంచి ఉదయం 6గంటల వరకు, లౌడ్ స్పీకర్లు వినియోగించడానికి వీల్లేదని మతం, కులం, ప్రాంతీయ అంశాలను ప్రస్తావిస్తూ విద్వేశాలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేయడం నిషేదమన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం, బెదిరింపులకు పాల్పడటం, తప్పుడు ప్రచారాలు చేయడంపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఆలయాలు, మసీదులు, చర్చిలు, ప్రార్థన స్థలాలు, పోలింగ్ కేంద్రాలకు వంద మీటర్ల పరిధిలో ప్రచారం నిర్వహించవద్దన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘిస్తే ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని దీన్ని పరిగణలోకి తీసుకొని సజావుగా ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన రేట్ చార్ట్ ప్రకారం ఎన్నికల వ్యయాన్ని లెక్కించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, ట్రైనీ ఐఏఎస్ కిరణ్మయి, ట్రైనీ ఐపీఎస్ చైతన్య రెడ్డి, అదనపు డీసీపీ కోటేశ్వర్‌రావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మెంట్రాజ్‌పల్లిలో బోనాల ఊరేగింపు



బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

డిచ్‌పల్లి, మార్చి 17: మండలంలోని మెంట్రాజ్‌పల్లి గ్రామంలో ఆదివారం పెద్దమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం పురష్కరించుకొని గ్రామ ముదిరాజు సంఘం సభ్యులు బోనాలు, నైవేద్యలు సమర్పించుకున్నారు.ఈఏడాది పాడిపంటలు సమృద్ధిగా పండాలని, వర్షాలు సమృద్ధిగా కురువాలని మొక్కులు తీర్చుకున్నట్లు ఆలయ నిర్వహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముదిరాజు సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధికి సన్మానం

ఆర్మూర్‌టౌన్ , మార్చి17: మండలంలోని అంకాపూర్ గ్రామంలో ఎమ్మెల్యే నివాసంలో ఆదివారం బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కలిగోట గంగాదర్‌ను ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి సన్మానించారు. ఇటీవల జిల్లా అధికార ప్రతినిధిగా నియామించబడిన గంగాధర్‌ను పట్టుశాలువతో ఎమ్మెల్యే ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొట్టాల సుమన్, కేసీ.ముత్తెన్న, దార్ల చిన్న ముత్తెన్న, తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కలిగోట గంగాధర్

ఆటో బోల్తా ఇద్దరికి గాయాలు

జక్రాన్‌పల్లి, మార్చి17: మండలంలోని పడకల్ గ్రామంలో ఆదివారం ఆటో బోల్తా పడి ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వినాయక్ నగర్ నుంచి ఆటోలో ఆరుగురు కుటుంబసభ్యులు కలిసి భీమ్‌గల్‌లోని లింబాద్రిగుట్టకు మొక్కులు తీర్చుకు నేందుకు ఆటోలో వెళ్తుం డగా పడకల్ గ్రామంలో ఎదురుగా వస్తున్న కుక్కను తప్పించబోయి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలైనట్లు తెలిపారు. ఘటన స్థలాన్ని ఎఎస్సై సుశీల్‌కుమార్ సందర్శించారు. ఈ విష యమై ఎస్సై సీహెచ్.తిరుపతిని వివరణ కోరగా ఆటో బోల్తా ప్ర మాద విషయమై ఫిర్యాదు రాలేదని తెలిపారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

ఆర్మూర్‌రూరల్, మార్చి17: ఆర్మూర్ పట్టణంలోని బదిరుల పాఠశాలలో రోటరీక్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో ఆదివారం పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, ఇతర సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షుడు పట్వారి గోపికృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలన్నారు. విద్యార్థులకు తనవంతు సేవలు ఎల్లవేళల అంది స్తామన్నారు. ఈ సమావేశంలో కార్యదర్శి పట్వారి తులసీ, కోశాధికారి లక్ష్మీనారా యణ, మాజీ అధ్యక్షుడు పుష్పకర్‌రావు, దామోదర్, రాస ఆనంద్, వినాయక్, గోపి, తదితరులు పాల్గొన్నారు.

ఆలూర్‌లో తాళం వేసిన ఇంట్లో చోరీ

ఆర్మూర్‌టౌన్, మార్చి17: ఆలూర్ మండల కేంద్రంలోని తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని దొంగలు శనివారం అర్ధరాత్రి చోరీకి పాల్పడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఆలూర్ మండల కేంద్రానికి చెందిన శివలింగం తన కుటుంబసభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి వివాహానికి వెళ్లారు. దీంతో గుర్తు తెలియని దొంగలు ఇంటి తాళం పగులగొట్టి లోనికవ వెళ్లి ఇంట్లోని బీరువను పగులగొట్టి రెండు తులాల బంగారం, రూ.10వేల 500నగదు, వెండి సామాగ్రిని చోరీ చేసినట్టు తెలిపారు. అనంతరం ఇంట్లో కరం చల్లి పరారీ అయ్యారు. స్థాని కులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

మానవత్వానికి జీవం పోయాలి: సీనియర్ సివిల్ న్యాయాధికారి



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ న్యాయాధికారి సీసం

ఆర్మూర్‌టౌన్ , మార్చి17: సభ్యసమాజంలో మనుషులు మానవ త్వాన్ని మరిచి పోతున్నారని మానవత్వానికి జీవం పోయాలని సీనియర్ సివిల్ న్యాయాధికారి నసీం సుల్తాన అన్నారు. ఆదివారం పట్టణంలోని చేయూత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహిళ దినోత్సవం సందర్భంగా మహిళ లకు ఉచిత ఆపరేషన్‌లు కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ మానవ సేవే మాదవసేవ అంటు ఎంజె ఆసుపత్రి డాక్టర్ మదుశేఖర్ చేయూత సంస్థ ద్వారా సేవలు చేయడం అభినందనీయమన్నారు. తల్లిదండ్రులను మరిచిపోతున్న సమాజం ఏలాంటి డబ్బులను ఆశించకుండా పేదవారికి సేవ లు చేస్తున్నారని ప్రతీఒక్కరు ఆదర్శంగా తీసుకొని తనకు నచ్చిన సేవలను చేస్తూ ముందుకు సాగాలని ఆమె అన్నారు. ఈ ఉచిత క్యాంప్ ద్వారా సుమారు 100 మందికి మహిళలకు ఆపరేషన్‌లు చేసినట్టు డాక్టర్ మదుశేఖర్ తెలిపారు. అనంతరం మహిళ దినోత్సవం సందర్భంగా సీనియర్ సివిల్ న్యాయాధికారి నసీం సుల్తానతో పాటు మరి కొందరు మహిళ డాక్టర్‌లను పట్టుశాలువ, పూలమాల, మెమొంటోతో డాక్టర్ మదుశేఖర్ దంపతులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో చేయూత స్వచ్ఛంద సంస్థ సభ్యులు కలిగోట గంగాధర్, బి.నాగరాజు, ఐడియా సాగర్, డాక్టర్ శ్రీలత, ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన కార్పొరేషన్ చైర్మన్లు



సీఎంను కలిసిన అన్వేష్‌రెడ్డి

నిజామాబాద్‌అర్బన్, మార్చి 17: జిలాకు చెందిన నలుగురు నేతలకు రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ చైర్మన్లు వచ్చాయి. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్‌కు ముందే ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 37 రాష్ట్ర స్థాయి కార్పొరేషన్లకు ఛైర్మన్లను నియమించింది. ఉమ్మడి జిల్లాకు చెందిన నలుగురు సీనియర్ నేతలకు రాష్ట్రస్థాయి పదవులు దక్కాయి. రాష్ట్ర మినరల్ కార్పొరేషన్ చైర్మన్‌గా మాజీ విప్ ఈరవత్రి అనిల్, రాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, రాష్ట్ర విత్తనాభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్‌గా రాష్ట్ర కిసాన్‌కాంగ్రెస్ ఛైర్మన్ అన్వేష్‌రెడ్డి, బాన్సువాడకు చెందిన కాసుల బాల్‌రాజ్‌కు రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ ఛైర్మన్లుగా ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఆదివారం ఈరవత్రి అనిల్, అన్వేష్‌రెడ్డిలు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి తమను కార్పొరేషన్ ఛైర్మన్లుగా నియమించినందుకు ధన్యవాదాలు తెలిపారు. మానాల మోహన్‌రెడ్డి మాజీ మంత్రి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని కలిసి ధన్యవాదాలు తెలిపారు.

● సంబరాలు

జిల్లాకు చెందిన నలుగురు ముఖ్య నేతలకు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ ఛైర్మన్లుగా ప్రభుత్వం నియమించడంపై జిల్లా కాంగ్రెస్ కార్యాలయం వద్ద బాణాసంచా కాల్చి స్వీట్లు పంచుకొని సంబరాలు నిర్వహించారు. ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు వేణురాజ్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వైసాక్షి సంతోష్, నరేందర్‌సింగ్, ప్రతాప్, సాయికిరణ్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్ పదవులతో కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

మెండోర, మార్చి17: మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షు డు కొత్తింటి ముత్యంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు జిల్లాకు చెందిన రాష్ట్ర నా యకులకు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు రావడంతో టపాకాయలు కాల్చి స్వీట్లు పంచుకొని సం బరాలు జరుపుకున్నారు. ఈ సందర్భం గా మాజీ ప్రభుత్వ విప్ ఈరవత్రి అ నిల్, రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ కార్పొరే షన్‌గా మానాల మోహన్‌రెడ్డికి రాష్ట్ర కో ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ ఛైర్మన్ గా అన్వేష్‌రెడ్డికి రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా రాష్ట్ర ప్రభుత్వం ప్రక టిం చడంతో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు టపాకాయలు కాల్చి సంబరాలు జరుపు కున్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గుండోజి రవి, కొప్పుల రమేస్, మచ్చర్ల మహేంధర్, నరేష్, సాయిరాం, వెంకట్, నవీన్, గంగారెడ్డి, సామ గంగారెడ్డి, జీవన్‌రెడ్డి, కండెల చిన్న ముత్యం, నోముల రాజన్న, కొప్పుల కరెంట్ ముత్యం, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

● రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్ పదవులతో కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

ముప్కాల్, మార్చి17: జిల్లాకు చెందిన రాష్ట్ర నాయకులకు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు రావడంతో ఆదివారం ముప్కాల్, బాల్కొండ మండలాల్లో కాంగ్రెస్ నాయకులు టపాకాయలు కాల్చి స్వీట్లు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ప్రభుత్వ విప్ ఈరవత్రి అనిల్‌కు రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ కార్పోరేషన్‌గా, మానాల మోహన్‌రెడ్డికి రాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ ఛైర్మన్‌గా, అన్వేష్‌రెడ్డికి రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు టపాకాయలు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. . ఈ కార్యక్రమంలో డీసీసీ డెలిగేట్ కార్యదర్శి జైడి చంద రవి, జిల్లా కమిటీ ఉపాధ్యక్షుడు రాజ్‌కుమార్, కాంగ్రెస్ కార్యదర్శి రాజ్‌వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బద్దం గంగారెడ్డి, నరేష్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

కిరోసిన్ పోసుకుని వ్యక్తి ఆత్మహత్య

ఆర్మూర్‌టౌన్, మార్చి17: పట్టణంలోని ఆర్టీవో కార్యాలయం సమీపంలో చేపూర్ గ్రామానికి చెందిన బండి గంగాధర్(64) ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎనిమిది నెలల క్రితం పట్టణంలోని జిరాయత్‌నగర్‌లో అక్కచెల్లెళ్ళ జంట హత్య కేసులో గంగాధర్ నిందితుడు. అప్పట్లో పోలీసులు అరెస్టు చేసి జైల్‌కు పంపగా మూడు నెలల క్రితం బెయిల్‌పై మృతుడు తిరిగి వచ్చాడు. మధుమేహ వ్యాధి గ్రస్తుడైన గంగాధర్ అనారోగ్య సమస్యలతో పాటు ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో మనస్థాపం చెంది గంగాధర్ ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్య చేసుకున్నట్టు తెలిసింది. స్థానికుల సమాచారం మేరకు ఎస్‌హెచ్‌వో రవికుమార్ సంఘటన స్థలానికి చేరుకొని ఆత్మహత్యకు గల కారణాలను ఆరా తీశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భార్య బండ లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

జక్రాన్‌పల్లి, మార్చి17: మండలంలోని మునిపల్లి గ్రామంలో 63వ జాతీయ హదారిపై బైక్ కిందపడగా మునిపల్లి గ్రామానికి చెందిన మర్రిపల్లి భరత్ కుమార్(23) చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్టు ఎస్సై తిరుపతి తెలిపారు. ఎస్సై సిహెచ్.తిరుపతి తెలిపిన వివరాలు ప్రకారం మునిపల్లి గ్రామానికి చెందిన భరత్‌కుమార్ బైక్‌పై ఆర్మూర్ వైపు వెళ్తుండగా అదుపుతప్పి కిందపడగా తీవ్రగాయాలయ్యాయి. ఆర్మూర్‌లో ఆసుపత్రిలో చికిత్స పొందుతుం డగా ప్రమాదకరంగా ఉండడంతో నిజామాబాద్ జిల్లాకు తరలించారు. చికిత్స పొందుతూ భరత్‌కుమార్ మృతి చెందినట్టు ఎస్సై తెలిపారు. మృతుని కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

రైతుల ఆశలను దెబ్బతీసిన వడగండ్ల వాన

● రైతులు ఆందోళన చెందవద్దు : ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ● దెబ్బతిన్న పంటలను పరిశీలించిన వ్యవసాయ అధికారులు


మొక్కజొన్న పంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి


గాలిదుమారంతో రాలిన మామిడి,చింత కాయలు


పెద్దవాల్గోట్‌లో దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి


దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు


పంటనష్టాన్ని పరిశీలిస్తున్న అధికారుల బృందం

బోధన్ రూరల్, మార్చి 17: అకాల వర్షానికి పంట నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటోందని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. ఆదివారం బోధన్, సాలూర మండలాలలోని నాగన్‌పల్లి, సాలూర క్యాంప్, కొప్పర్తి క్యాంప్ తదితర గ్రామాల్లో పర్యటించారు. అకాల వర్షం, వడగండ్ల వానతో రైతుల చేతికి వచ్చిన పంట అందకుండా పోయిందన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పంటలకు బీమా సౌకర్యం కల్పించకుండా రైతు ప్రభుత్వం అంటూ గొప్పలు చెప్పుకున్నారని ఆరోపించారు. బోధన్, సాలూర మండలాల్లో మొక్కజొన్న పంట అధికంగా దెబ్బతిందన్నారు. నష్టపోయిన పంటపొలాలను పరిశీలించి ప్రభుత్వం తరఫున మంచి మొక్కజొన్న పంటకు గిట్టుబాటు ధర కల్పించి తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అకాల వర్షాలవల్ల దెబ్బతిన్న పంట నష్టంపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పంట నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకుంటామని రైతులకు భరోసా కల్పించారు. రైతుల పంట పొలాల్లోకి వెళ్లి స్వయంగా పంటలను పరిశీలించారు. వడగండ్లు, అకాల వర్షం ప్రతి సంవత్సరం రైతులను ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ప్రభుత్వమని రైతుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తోందన్నారు. రైతులు ఆందోళన చెందొద్దని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు. నష్ట జరిగిన పంటలను వ్యవసాయశాఖ అధికారులు పరిశీలించి ఎంతవరకు నష్టం జరిగింది అంచనావేసి నివేదిక పంపాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, మండలాల అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, మందర్న రవి, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దొడ్ల రవీందర్ రెడ్డి, నాయకులు పాషా మొయినుద్దీన్, దాము, శరత్ రెడ్డి, అల్లె రమేష్, తలారి నవీన్ తదితరులు ఉన్నారు.

● అకాల వర్షం, అపార నష్టం

శనివారం రాత్రి కురిసిన అకాల వర్షం ఈదురు గాలులకు పంట పొలాలకు అపార నష్టం వాటిల్లింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికొచ్చే సమయంలో అకాల వర్షానికి గురవడం రైతుకంట కన్నీరు పెట్టించింది. చేతికొచ్చిన పంట నీటిపాలైందని పంట నష్టపోయిన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షం రైతులతో దోబూచు లాడుతుందని వడగండ్లు అపార నష్టాన్ని కలిగించింది. బోధన్, సాలూర మండలాల్లో దాదాపు 300 ఎకరాల్లో మొక్కజొన్న పంట నష్టం, 50 ఎకరాల్లో వరి పంట నష్టం వాటిల్లిందని వ్యవసాయ శాఖ అధికారి సంతోష్ తెలిపారు.

● రైతుల ఆశలను దెబ్బతీసిన వడగండ్ల వాన

సిరికొండ: సిరికొండ మండలంలో శనివారం సాయంత్రం గురిసిన వడగండ్ల వానకు చేతికొచ్చిన వరి పంటకు నష్టం వాటిల్లి రైతులు ఆశలను అడియాసలు చేసినట్లయింది. వరి పంటను కోయడానికి సిద్ధం చేసుకున్న రైతాంగానికి వరి కోత మిషన్లు లభించక పోవడం వల్ల కోతకొచ్చిన పంట కళ్ల ముందే నేలరాలి పోవడం వల్ల రైతులు కన్నీటి పర్యాయంతమయ్యారు. కోసి ధాన్యాన్ని కుప్ప పోసిన నష్టపోకుండా ఉండే వారమని రైతులు వాపోతున్నారు. శనివారం మండంలోని మెజారిటీ గ్రామాల్లో రాళ్ల వాన కురువడం వల్ల ధాన్యం నేలపాలయిందని దీని వల్ల తాము ఆర్థికంగా తీవ్రంగా నష్టపోవలసి వచ్చిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ముఖ్యంగా కొండూర్, పెద్దవాల్గోట్, చిన్నావాల్గోట్, మైలారం, సిరికొండ,న్యావనంది, రావుట్ల, చీమన్‌పల్లి, తాటిపల్లి గ్రామాల్లో వడగండ్ల వాన కురసి వరి పంట బాగా దెబ్బతిన్నది. ప్రతి ఏడాది మండలంలో వరుణుడు కోపాగ్నికి పంట దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఏ ప్రభుత్వాలు ఆదుకున్న పాపాన పోవడం లేదు.వర్షాకాలంలో అధిక వర్షాల వల్ల పంటలు దెబ్బతిన్న, యాసంగి పంటకు వడగండ్ల రూపంలో ప్రమాదం సంభవించడం వల్ల రైతుల నష్టపోతున్న ప్రభుత్వాలు పరిహారం చెల్లించక పోవడం మూలంగా రైతులు ఆర్థికంగా చాలానష్టపోతున్నారు.పంటలు దెబ్బతిని నష్టపోయిన వారిని ఆదుకోవడానికి ఉదారంగా ముందుకు రావాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

● పంటను పరిశీలించిన వ్యవసాయ అధికారులు

శనివారం సాయంత్రం వడగండ్ల వాన కురిసిన దెబ్బతిన్న పంటలను ఆదివారం వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ప్రదీప్‌కుమార్, మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్ తమ సిబ్బందితో పరిశీలించారు.పెద్దవాల్గోట్‌లో వ్యవసాయ అదికారి వెంకటేష్, కొండూర్ గ్రామంలో ఏడీఏ ప్రదీప్‌కుమార్ రాళ్ల వాన కురిసి నష్టం వాటిల్లిన పంటను పరిశీలించి నష్టాన్ని అంచన వేశారు. మండంలోని పెద్దవాల్గోట్,కొండూర్,చామన్‌పల్లి, పందిమడుగు,తాటిపల్లి గ్రామాల్లో అధికారులు తిరిగి పంట నష్టాన్ని అంచన వేశారు. మండలంలో 1552 ఎకరాలలో వరి పంట వడగండ్ల వాన వల్ల పంటలు బాగా దెబబతిన్నాయని వ్యవసాయ అధికారి వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. అధికారుల వెంట ఏఈవోలు శ్రీకాంత్, సతీష్, కృష్ణరెడ్డి తదితరులు ఉన్నారు.

● రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి :ధర్పల్లి జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్

వడగండ్ల వానకు పంట నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ధర్పల్లి జడ్పీటీసీ సభ్యులు బాజిరెడ్డి జగన్ కోరారు. సిరికొండ మండలం కుర్దుల్‌పేట్ గ్రామంలో తడిసిన ధాన్యాన్ని బాజిరెడ్డి జగన్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఆయన కోరారు. వడగండ్లకు ధాన్యం నేలరాలిన రైతులకు పరిహారం చెల్లించాలని ఆయన కోరారు.ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యులు సతీష్,వైస్ ఎంపీపీ రాజగంగాయ్య, బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

డిచ్‌పల్లి: గత రాత్రి ఎడతెరిపి లేకుండా కురిసిన అకాల వర్షంతో మండలంలోని యానంపల్లి, సుద్దులం, కోరట్‌పల్లి గ్రామాల రైతులు తీవ్ర స్థాయిలో పంటలు నష్టపోయారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటలు నేలపాలు కావడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యానంపల్లి,రాంపూర్, సుద్దులం,కోరట్‌పల్లి గ్రామాల్లో నష్టపోయిన వరి పంటలను జిల్లా వ్యవసాయాధికారి వాజీద్ హుస్సేన్, మండల వ్యవసాయాధికారి రాంబాబు, మండల విస్తీర్ణాధికారి రుపేశ్‌లు పరిశీలించారు. పంట నష్ట వివరాలను జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు. సుద్దులం గ్రామంలో 160 ఏకరాలు, కోరట్‌పల్లిలో 280ఏకరాలు, వరి పంట నష్టం వాటిల్లిందని, వ్యవసాయ అధికారులు అంచన వేశారు. అంతేగాకుండా మామిడి, మొక్కజొన్న చింతకాయ, పంటలు నష్టం వాటిల్లాయి. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి వ్యవసాయ అధికారులు వడగండ్లతో నష్టపోయిన రైతులను ప్రభుత్వ పరంగా ఆదుకునేందుకు పంట నష్టపోయిన వివరాలను మండల, జిల్లా వ్యవసాయాధికారులు అంచనాలు తయారు చేయాలని, ప్రత్యేక్షంగా పంటలను పరిశీలించాలని సూచించారు. గత ఏడాది సుద్దులం , కోరట్ పల్లి ప్రాంతాల్లో అకాల వర్షాలకు పంట నష్టపోయిన చిల్లి గవ్వ ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వమైన రైతులను ఆదుకోవాలని రైతులు కోరారు.

● పంట నష్టాన్ని అంచనా వేస్తున్న అధికారులు

ధర్పల్లి:మండలంలోని కొటాల్‌పల్లి, నడిమితండా, రామడుగు గ్రామాలలో శనివారం రాత్రి కురిసిన వడగండ్ల వానతో దెబ్బతిన్న పంటను ఆదివారం మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్ ఆధ్వర్యంలో పరిశీలించారు. ఆయా గ్రామంలో దెబ్బతిన్న పంటలను పరిశీలించి పంట నష్టాన్ని త్వరలోనే అంచనా వేసి తుది నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తామని ఆయన చెప్పారు.

ఇందల్వాయి:మండలంలోని నల్లవెల్లి,సిర్నాపల్లి,మేగ్యానాయక్ తండా, గన్నారం,చంద్రయాన్‌పల్లి, ఇందల్వాయి తదితర గ్రామాల్లో శనివారం రాత్రి కురిసిన వడగండ్ల వానతో రైతన్నకు తీవ్రనష్టం వాటిల్లింది.పలు చోట్ల రాళ్లవర్షం కురవడంతో చేతికొచ్చిన ధాన్యం నేలపాలైంది.వారం రోజుల్లో కోతదశలో ఉన్న పంటపై ప్రకృతి కన్నెర్రచేసి వడగండ్ల వాన కురవడం వల్ల పూర్తిగా ధాన్యం నేలపాలైంది. మండలంలోని వివిధ గ్రామాల్లో అకాల వర్షం వల్ల దెబ్బతిన్న పంటలను పరిశీలించాలని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఆదేశించడంతో వ్యవసాయ అధికారులు దెబ్బతిన్న పంటలను పరిశీలించి వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు తాము అకాల వర్షంతో తీవ్రంగా నష్టపోయామని ప్రభుత్వం తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. మండల వ్యాప్తంగా శనివారం సుమారు గంటన్నరకు పైగా కురిసిన వర్షంతో వరిధాన్యంతో పాటు మొక్కజొన్న, పత్తి తీవ్రంగా దెబ్బతిన్నాయని కల్లాలు ఆరబోసిన మొక్కజొన్న పూర్తిగా తడిసి ముద్దయిందని అన్నారు. గన్నారం 44వ జాతీయ రహదారి పక్కన ఆరబోసిన మొక్కజొన్న వర్షానికి కొట్టుకుపోయిందన్నారు. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఈ సందర్భంగా వారు విజ్ఞప్తి చేశారు. మండలంలోని వివిధ గ్రామాల్లో వ్యవసాయ అధికారులు ఏవో ప్రకాశ్ గౌడ్, శ్రీహరి, సతీష్ నష్టపోయిన పంటల వివరాలను నమోదు చేసుకున్నారు.

సంక్షిప్త సమాచారం

ముఖ్యమంత్రిని కలిసి ఖనిజాల అభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్


సీఎం రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న ఖనిజాల అభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్

మెండోర, మార్చి17: సీఎం రేవంత్‌రెడ్డిని ఖనిజాల అభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్ కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌తో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో ఆదివారం కలిసి ఖనిజాల అభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్‌ను నియామించినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈకార్యక్రమంలో మాజీ జిల్లా సర్పంచ్‌ల ఫోరంసంఘం అధ్యక్షుడు, గోర్తరాజేందర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మానాల మోహన్‌రెడ్డిని కలిసిన ఏర్గట్ల నాయకులు


మానాల మోహన్ రెడ్డిని కలిసిన ఏర్గట్ల కాంగ్రెస్ నాయకులు

ఏర్గట్ల, మార్చి 17: తెలంగాణ రాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ కార్పోరేషన్ చైర్మన్‌గా నియమితులైన మానాల మోహన్ రెడ్డికి ఏర్గట్ల మండలంలోని కాంగ్రెస్ నాయకులు ఆదివారం తన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తనపై నమ్మకంతో గుర్తించిందినందు సీఎం రేవంత్ రెడ్డికి మానాల మోహన్ రెడ్డి అభినందనలు తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా జనరల్ సెక్రెటరీ పెద్దిరెడ్డి రవి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రేండ్ల రమేష్, రొక్కిడ సంజీవ్, శాంసన్, గజేందర్, హరీష్‌లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బకాయిలను వెంటనే చెల్లించాలి


మాట్లాడుతున్న టీయుపీఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి రామకృష్ణరెడ్డి

ఆర్మూర్‌రూరల్, మార్చి17: ప్రభుత్వ ఉపాధ్యాయులకు రావల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని టీయూపీఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి రామకృష్ణరెడ్డి, జిల్లా బాధ్యులు నల్ల కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లోని ఆర్మూర్, ఆలూర్ మండలాల సంబంధించిన టీయుపీఎస్, జానజాగరణ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న సమస్యలను ఎన్నికలకు ముందే పరిష్కరించడానికి ప్రభుత్వం చిత్తశుద్ధి చూపడంలేదన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం నిమ్మకు నిరెత్తినట్టు వ్యవహరించడం బాధకరమన్నారు. గత ఎన్నికల మునిన వెంటనే పరిష్కరిస్తామన్న సమస్యలన్నింటిని వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఈనెల 31తేదీ లోగా అన్ని బకాయిలు చెల్లించాలన్నారు. ఈ సమావేశంలో శివాజీ, రాష్ట్ర టెక్నికల్ కమిటీ సభ్యుడు రుద్రమధుసూదన్, మహిళ కోకన్వీనర్ రజిత, మండల బాధ్యులు వెంకటరమణ, రవి, గజేందర్, స్రుతిమ, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు సునీల్‌రెడ్డి పరామర్శ


వెల్కటూర్‌లో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న సునీల్‌రెడ్డి

మెండోర, మార్చి17: మండలంలో వెల్కటూర్ గ్రామంలో పలు బాధిత కుటుంబాలను బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా సంగ అంజయ్య తండ్రి చిన్నయ్య, ఏర్గట్ల మల్లేష్ తల్లి లక్ష్మీ ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో వారి కుటుంబసభ్యులను పరామర్శించి సంతాపాన్ని తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

30న డిచ్‌పల్లి ఎంపీపీపై అవిశ్వాస సమావేశం

డిచ్‌పల్లి,మార్చి 17: డిచ్‌పల్లి ఎంపీపీగా కొనసాగుతున్న గద్దె శ్రీనివాస్, అలియస్ భూమన్న(బీజేపీ)పై ఎంపీటీసీలు ఇచ్చిన అవిశ్వాస తీర్మానం మేరకు ఈనెల 30న డిచ్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో అవిశ్వాస సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆర్డీవో రాజేందర్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఎంపీటీసీ సభ్యులకు అవిశ్వాస తీర్మాన సమాచార నోటీస్‌ను లేఖ ద్వారా సమాచారం అందజేశారు. ఇది వరకే వైస్ ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం నెగ్గింది. ప్రస్తుతం మండలంలో 17మంది ఎంపీటీసీలు కొనసాగుతున్నారు. మెజార్టీ ఎటువైపు ఉంటుందో 30న తేలిపోనుంది. గత నెల అవిశ్వాసం తేదిని అధికారులు ప్రకటించారు. కానీ ఎంపీపీ గద్దె భూమన్న హైకోర్టు నుంచి స్టే తీసుకురావడంతో వాయిదా పడింది. తిరిగి 30న మళ్లీ అవిశ్వాస తీర్మాన సమావేశం ఉంటోందని ఆర్డీవో ప్రకటనలో పేర్కొన్నారు.

ఓబీసీ రెంజల్ మండల అధ్యక్షుడిగా నితిన్


నియమాక పత్రం అందజేస్తున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

రెంజల్,మార్చి17: రెంజల్ మండల ఓబీసీ మండల అధ్యక్షుడిగా సాటాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు రచ్చవార్ నితిన్‌ను నియమించడం జరిగింది. ఆదివారం నిజామాబాద్‌లోని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి నివాసంలో ఎమ్మెల్యే సుదర్శన్, ఓబీసీ చైర్మన్ రాజా నరేంద్రగౌడ్ చేతుల మీదుగా నియమాకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నితిన్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఓబీసీ మండల అధ్యక్షుడిగా నియమించినందుకు ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు అంతిరెడ్డి రాజిరెడ్డి, రెంజల్ మండల కాంగ్రెస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, ఎడపల్లి మండల అధ్యక్షుడు పులిశ్రీనివాస్, మాజీ సర్పంచ్ సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం సంఘ అభివృద్ధికి కృషి చేయాలి

పెద్దబజార్, మార్చి 17:నూతన కార్యవర్గం సంఘ అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. ఆదివారం నగరంలోని శివాజీనగర్‌లో గల మున్నూరుకాపు కల్యాణ మండపంలో నిర్వహించిన ఏడు తర్లాల మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎంపీ ధర్మపురి అర్వింద్ హాజరై మాట్లాడారు. మున్నూరుకాపులు ఐక్యతగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ధర్మపురి అరవింద్

నేరాల నియంత్రణకు పోలీసు శాఖ కృషి

● రద్దీగా ప్రాంతాలను పర్యవేక్షించిన సీపీ
● అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనే ధ్యేయంగా ప్రయత్నాలు


పరిశీలిస్తున్న సీపీ కల్మేశ్వర్‌శింగనేవార్(ఫైల్)

ఖిల్లా ,మార్చి 17:నగరంలో నేరాల నియంత్రణకు పోలీసు శాఖ కృషి చేస్తుంది. రద్దీగా ఉన్న ప్రాంతాలను పర్యవేక్షించి అసాంఘిక కార్యకలాపాలు జరుగకుండా అన్ని చర్యలు చేపట్టింది. నేరాలను నియంత్రించి ప్రజలకు మెరుగైన పోలీసు సేవలను అందించడానికి ప్రయత్నాలను చేస్తుంది. ఇందులో భాగంగానే శనివారం రాత్రి రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్‌స్టాండ్ ప్రాంతాల్లో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి పెట్టింది. వీటిని అరికట్టేందుకు నేరుగా పోలీసు కమీషనర్ కల్మేశ్వర్‌శింగనేవార్ నిజామాబాద్ ఏసీపీ.ఎల్.రాజవెంకటరెడ్డితో కలిసి ఆయా ప్రాంతాలను పరిశీలించారు. ముఖ్యంగా ఆర్టీసీ బస్‌స్టాండ్, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో వ్యభిచారం,దొంగతనాలు, చైన్‌స్నాచింగ్, మాయలేడీల ఆగడాలు, హత్యలు జరుగుతున్న విషయాలను సమగ్ర విచారణ చేపటారు. రద్దీగా ఉండే ప్రాంతాల్లో హత్యలు జరిగిన విధానాన్ని తెలుసుకుని అటువంటి ఘటనలను తిరిగి జరుగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నారు.ఇతర ప్రాంతాల నుంచి నగరానికి వచ్చే కొత్త వారిని గుర్తించే కొందరు వారికి మాయమాటలు చెప్పి వారిని బుట్టలో వేసుకుని వారి వద్ద నుంచి సొమ్ము, నగదు అపహరించడం జరుగుతున్న కేసులను దృష్టిలో పెట్టుకుని అటువంటి ఘటనలు జరుగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా అనుమానితులను పై నిఘా పెట్టడానికి సివిల్ దుస్తుల్లో పోలీసుల ద్వారా నిఘా పెట్టించి వారి ఆటలు కట్టించడానికి సిబ్బందిని నియమించనున్నారు. గత కొంత కాలంగా మహిళలు ఇటువంటి ఘటనలకు పాల్పడుతున్న నేపథ్యంలో ప్రజలకు రక్షణగా పోలీసుశాఖ ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయనుంది. నేరాలతో పాటు ట్రాఫిక్ ఇబ్బందులను నియంత్రించేందుకు సైతం పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి పెట్టింది. నిబంధలనకు విరుద్ధంగా రోడ్ల పై విచ్చలవిడిగా వాహనాలను పార్కింగ్ చేసే వారి వాహనాలను సైతం స్వాధీనం చేసుకుని వారికి జరిమాన విధించడానికి సిద్దమవుతోంది. రద్దీగా ఉండే ప్రాంతాల్లో రోడ్లపై విచ్చలవిడిగా వాహనాలను పార్కింగ్ చేయకుండా అన్ని చర్యలు తీసుకుంటుంది. రోడ్డును ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవడానికి సిబ్బందికి ఆదేశాలు జారీ చేసింది.

ఉమ్మడి మండలంలో పాక్షికంగా దెబ్బతిన్న వరిపంట

కోటగిరి,మార్చి17: కోటగిరి ఉమ్మడి మండలంలో శనివారం రాత్రి కురిసిన అకాల వర్షానికి వరిపంటకు పాక్షికంగా నష్టం వాటిల్లింది. మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస రావు ఆదివారం ఆయా గ్రామాలలో దెబ్బతిన్న వరిపంట పొలాలను పరిశీలించారు. పొతంగల్ మండలంలోని కల్లూర్ శివారులో సుమారు 100ఎకరాల్లో, కోటగిరి మండలంలోని అడ్కాస్‌పల్లి, లింగాపూర్, గన్నారం, బర్దీపూర్ శివారులలోనూ సుమారు 100ఎకరాల్లో వరిపంటకు పాక్షికంగా దెబ్బతిన్నట్లు ఆయన తెలిపారు. ఈదురు గాలులు, అకాల వర్షానికి వరిపంట నేలకొరిగిందని ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రాంరెడ్డి, ఏఈవో గౌస్, రైతులు లింగాప్ప తదితరులు పాల్గొన్నారు.

కోటగిరిలో కాంగ్రెస్ నాయకుల సంబరాలు


కోటగిరిలో సంబరాలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కోటగిరి,మార్చి17: కోటగిరి మండల కేంద్రంలో ఆదివారం కాంగ్రెస్ నాయకులు సంబరాలు నిర్వహించారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ ప్రాంగణంలో టపాకాయలు కాల్చి సంబరాలు నిర్వహించారు. బాన్సువాడ నియోజకవర్గ నాయకులు కాసుల బాలరాజుకు ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్‌గా నియమించడంపై హర్షం వ్యక్తం చేశారు. పార్టీ కోసం కష్టపడి పని చేసే వారిని సీఎం రేవంత్ రెడ్డి గుర్తించి కార్పొరేషన్ పదవి అప్పగించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కొట్టం మనోహర్, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ రావు, వేణు, గణేష్, హైమద్, అబ్బయ్య, కూచి శ్రీనివాస్, ఆనంద్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.150	రూ.220	రూ. 260
వెన్‌కాబ్(కిలో)	రూ.160	రూ.230	రూ. 270

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.66,600	రూ.61,450	రూ.780

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

- స్క్రీన్-1 : యోధ (హిందీ) (10.10, 1.10, 10.10) : షరతులు వర్తిసాయి (4.10) : ఇత్త కిత్త (గుజరాతి) (7.10)
- స్క్రీన్-2 : కుంగుఫూ పాండా4 (ఇంగ్లీష్ 3డీ) (12.05, 2.25, 8.00) : ప్రేమలు (4.45) : రజాకర్ (10.20)
- స్క్రీన్-3 : గామి (10.25, 7.20) : సైతాన్ (హిందీ) (1.35) : లంబాసింగి (4.35) : బస్తర్ ది నక్సల్ స్టోరీ (తెలుగు) (10.30)
- స్క్రీన్-4 : తంత్ర (10.30) : బస్తర్ ది నక్సల్ స్టోరీ (తెలుగు) (1.25): భీమా (4.15) : సైతాన్ (హిందీ) (7.20) : ప్రేమలు (10.20)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

- స్క్రీన్-1 : ప్రేమలు (1.30, 7.30) : గామి (4.30, 10.30)
- స్క్రీన్-2 : రజాకర్ (10.40) : భీమా (1.40, 4.30, 7.40) : యోధ (హిందీ) (10.40)
- స్క్రీన్-3 : రజాకర్ (1.30, 4.30, 7.30, 10.30)

- దేవి : ప్రేమలు (11.15, 2.15, 6.15, 9.15)
- లలితమహాల్ : భీమా (11.15, 2.15, 6.15 9.15,)
- నటరాజ్ : తంత్ర (11.15, 2.15, 6.15, 9.15)
- విజయ్ : రజాకర్ (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్